RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం

AKSHARA VEDAM TELUGU DAILY

Published at Karimnagar circulated in : Telangana | సంపుటి : 04 | సంచిక : 34 | ఎడిటర్ :పొన్నం ప్రసాద్ గౌడ్ | శనివారం 03-01 -2026 | పేజీలు -6 | వెల: రూ. 05.00

విలేకరులు కావలెను

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ -పొన్నం ప్రసాద్ గౌడ్

9666992524

## మూసీ పునరుజ్జీవంతో నగరానికి మహర్దశ

మూసీ పొడువునా ఎలివెటెడ్ కారడార్ల నిర్మాణం

నిర్వాసితులకు పక్కా ఇళ్లు కట్టించి ఇస్తాం

- గోదావరి జలాలతో నిరంతరంగా ప్రవాహం
- మూసీ పరివాహకరంలో నైట్ బజార్‌ల అభివృద్ధి
- అంతర్జాతీయ కన్సల్టెంట్లతో ప్రణాళికలు
- డిపిఆర్ సిద్ధం కాగానే ఎమ్మెల్యేలకు వివరణ
- కొందరు కావాలనే మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- అసెంబ్లీలో మూసీ అభివృద్ధిపై సీఎం రేవంత్ వివరణ

**హైదరాబాద్**

మూసీ పునరుజ్జీవనంతో హైదారబాద్ ఖ్యాతిని మరింత పెంచడంతో పాటు, మెరుగైన నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మూసీ పొడువునా గోదావరి నీటిని పారించి సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఈ క్రమంలో నిర్వాసితులకు పునరావసం కూడా కల్పిస్తామని అన్నారు. నిజాం ఎంతో ముందుచూపుతో మూసీ పొడవునా మంచి కట్టడాలు కట్టి ఆదర్శంగా నిలిచారని అన్నారు. నిజాంలు నిర్మించిన ప్రాజెక్టులే హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని అన్నారు. గతంలో జలవనరులను కాపాడుకొనే ప్రయత్నాలు జరగలేదని విమర్శించారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో జరగిని చర్చలో సీఎం మాట్లాడారు. గతంలో జల వనరులను కలుషితం చేశారు. కబ్జాలతో ఫాంహౌస్‌లు నిర్మించారు. వాటి డ్రైనేజీలను జంట జలాశయాలకు కలిపారు. -మిగతా 2 లో





## అంగారక గ్రహంపై నీటి గుహలు..

- నీటి వల్ల గుహలు ఏర్పడినట్లు అంచనా
- భూమి కాకుండా మరో గ్రహంపై నీటి గుహలను గుర్తించడం ఇదే మొదటిసారి
- గుర్తించిన చైనా శాస్త్రవేత్తలు

**న్యూయార్క్ -**

అంగారక గ్రహం పై నీటి గుహలను చైనా శాస్త్రవేత్తలు గుర్తించారు. హిబ్రుస్ వాలీస్ ప్రాంతంలో ఆ గుహలు ఉన్నట్లు తేల్చారు. నీటి వల్ల గుహలు ఏర్పడినట్లు అంచనా వేస్తున్నారు. భూమి కాకుండా మరో గ్రహంపై నీటి గుహలను గుర్తించడం ఇదే మొదటిసారి. మార్స్ గ్రహంపై అగ్నిపర్వతాల ద్వారా ఏర్పడిన గుహలను గతంలో గుర్తించారు. కానీ రాళ్లలోని రసాయనాల వల్ల నీటి గుహలు ఏర్పడినట్లు తాజా రిపోర్టులో తేల్చారు. ద ఆస్ట్రోఫిజికల్ జనరల్ లెటర్స్‌లో ఈ స్టడీకి చెందిన నివేదిక ఇచ్చారు.నీటి గుహల ఆవిష్కరణ మార్స్ గ్రహంపై జీవం ఉందన్న ఆధారాలను స్టడీ చేసేందుకు ఊతం -మిగతా 2 లో



## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్

- గన్ పార్క్ వద్ద ధర్నా..ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు
- సభలో మాట్లాడనీయకుండా మైక్ కట్ చేస్తారా
- స్పీకర్ తీరుపై హరీశ్ రావు అసహనం



**హైదరాబాద్-**

శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. సీఎం మాట్లాడిన తర్వాత సభలో మాట్లాడేందుకు, నిరసన తెలిపేందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. సభలో ప్రభుత్వం పెట్టే బిల్లులపై చర్చకు దూరంగా ఉండాలని నిర్ణయించారు. ఎమ్మెల్యేల ప్రవేశద్వారం వద్ద వారు ఆందోళనకు దిగారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారంటూ నినాదాలు చేశారు. అనంతరం గన్‌పార్క్ వద్దకు వెళ్లి అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. సభలో సభ్యులకు సమాన హక్కులుంటాయని.. వాటిని స్పీకర్ కాపాడాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఏడు రోజుల సభ నిర్వహణపై బీఏసీలో -మిగతా 2 లో


## నేడు కొండగట్టుకు డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్

- టిటిడి నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

**అమరావతి,**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం తెలంగాణ రాష్ట్రంలోని కొండ గట్టు ఆంజనేయ స్వామి క్షేత్రానికి కళ్యాణ్ వెళ్లనున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సహకారం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయ క్షేత్రానికి తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ నిధులు మంజూరు చేసింది. -మిగతా 2 లో





## పుతిన్ నివాసంపై డ్రోన్ దాడులు

- అమెరికాకు ఆధారాలు సమర్పించిన రష్యా
- ట్రంప్ చర్యలకు విఘాతంగా మారిన పరిస్థితులు

**మాస్కో -**


యుద్ధం ముగించేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇల్లే లక్ష్యంగా డ్రోన్ దాడులు జరగడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది ఉద్రిక్తతలను మరింత పెంచేదిగా మారింది. ఉక్రెయిన్ దళాలు ఈ దాడికి పాల్పడ్డాయంటూ రష్యా ఆరోపించిన సంగతి తెలిసిందే. వీటిని పలు దేశాలు ఖండిస్తున్న నేపథ్యంలో.. దాడి నిజమేనని నిరూపించుకునే పనిలో పడింది రష్యా. ఇందులోభాగంగా దాడికి సంబంధించి లభ్యమైన కొన్ని ఆధారాలను అమెరికాకు అందజేసింది. ఈ మేరకు ఆ దేశ రక్షణ మంత్రిత్వశాఖ ఓ వీడియో విడుదల చేసింది. రష్యా సైనిక నిఘా సంస్థ అధిపతి అడ్మిరల్ ఇగోర్ కోస్ట్యుకోవ్ మాస్కోలోని యూఎస్ మిలిటరీ అటాచ్ అధికారులతో భేటీ అయ్యారు. ఈసందర్భంగా కోస్ట్యుకోవ్ మాట్లాడుతూ.. దాడికి ఉపయోగించిన మానవరహిత విమానం శకలాలను తాము కనుగొన్నట్లు తెలిపారు. తమ దళాలు కూల్చివేసిన అనేక డ్రోన్లలోని నేవిగేషన్ వ్యవస్థలు చెక్కుచెదరకుండా ఉన్నాయన్నారు. -మిగతా 2 లో


## బ్లడ్‌లో తిరిగే బుల్లి రోబోలు..

- కోరిన చోటకు ఔషధం చేరవేత
- పందులపై పరీక్షల్లో సత్ఫలితాలు
- త్వరలోనే మనుషులపై ప్రయోగాలు
- హెవీ డోస్ ఇంజెక్షన్లకు ఇక చెల్లు

**బెర్న్: -**

రోబోల రాకతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. ప్రస్తుతం అనేక శస్త్రచికిత్సలు రోబోలే నిర్వహిస్తున్నాయి. తాజాగా స్విట్జర్లాండ్‌కు చెందిన శాస్త్రవేత్తలు సరికొత్త మినీ రోబోలను అభివృద్ధి చేశారు. శరీరంలోకి ప్రవేశించి రోగాన్ని నయం చేసే ఈ బుల్లి రోబోలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ఇవి రక్తంలో ప్రవహిస్తూ కోరిన చోటకు ఔషధాన్ని చేరవేస్తాయి. పందులపై జరిపిన పరీక్షల్లో సత్ఫలితాలు వచ్చాయని, 95 శాతం కేసుల్లో అనుకున్న చోటకే ఈ రోబోలు ఔషధాన్ని చేరవేశాయని పరిశోధకులు తెలిపారు. త్వరలోనే మనుషులపై వీటిని పరీక్షించనున్నట్టు చెప్పారు.సెకనుకు 20 సెంటీమీటర్లు..శరీరంలో ఔషధం ఎక్కడ అవసరమో కచ్చితంగా -మిగతా 2 లో





## ఢిల్లీని కమ్మేసిన పొగమంచు..

- విమాన సేవలపై ప్రభావం
- పలు విమానాలు రద్దుకాగా, మరికొన్ని ఆలస్యం
- శుక్రవారం ఉదయం నగరంలో ఏక్యూఐ లెవెల్స్ 386గా నమోదు

**న్యూఢిల్లీ -**

దేశ రాజధాని ఢిల్లీని దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో దృశ్యమానత గణనీయంగా పడిపోయింది. ఈ కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. విజిబిలిటీ పడిపోవడంతో ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విమాన కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. పలు విమానాలు రద్దుకాగా, మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇంకొన్నింటిని అధికారులు దారి మళ్లించారు.పొగమంచు విపరీతంగా కురుస్తున్నందున విజిబిలిటీ తగ్గిపోవడంతో పలు విమానాలను రద్దు చేస్తున్నట్లు ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు ప్రకటించాయి. విమానాల రద్దుతో ప్రభావితమైన ప్రయాణికులు ఆన్‌లైన్‌లో రీబుక్ చేసుకోవచ్చని, లేదంటే డబ్బు వాపసు పొందవచ్చని తెలిపాయి. మరోవైపు రైలు సేవలు కూడా ప్రభావితమయ్యాయి.పొగమంచు పరిస్థితులకు తోడు ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో గాలి నాణ్యత -మిగతా 2 లో

## కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిందే

రేవంత్ భాష తీరు దారుణం

- కేసీఆర్‌ను ఉరి తీయాలంటారా?
- అలా అయితే రేవంత్‌ను పదిసార్లు ఉరితీయాలి
- హరీష్ రావు బబుల్ షూటర్ మాత్రమే

**హైదరాబాద్**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయంగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అలాగే పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టిన కేసీఆర్‌ను ఉరి తీయాంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కవిత తీవ్రంగా స్పందించారు. -మిగతా 2 లో





## కవిత కేసీఆర్ వదిలిన బాణమే

- అందులో అనుమానం లేదన్న కోమటిరెడ్డి
- సీఎం రేవంత్ అంటే అభిమానమని వ్యాఖ్య

**హైదరాబాద్,**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ వదిలిన బాణం కవిత అని ఆయన అభివర్ణించారు. కవిత కన్ఫ్యూజన్‌లో ఉండి ప్రజలను కన్ఫ్యూజ్ చేస్తోందని వ్యంగ్యంగా అన్నారు. కవిత ఏ పార్టీలో ఉందో స్పష్టం చేయాలంటూ మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. తన తండ్రి మీద సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆమె.. హరీష్ రావు మీద చేసిన వ్యాఖ్యలపై ఎందుకు స్పందించలేదు? -మిగతా 2 లో

# మూసీ పునరుజ్జీవంతో నగరానికి మహర్దశ

మొదటి తరువాయి

నిందితులపై ఉక్కుపాదం మోపాం. డ్రైనేజీలను కూలగొట్టాం. కాకతీయుల నుంచి నిజాం వరకు నదీ పరివాహకంలోనే ప్రాజెక్టులు చేపట్టారు. వరద ముంపు నుంచి నగరాన్ని రక్షించేందుకు 1922 నాటికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ ప్రాజెక్టులు చేపట్టారు. ప్రపంచ దేశాలతో హైదరాబాద్ పోటీపడేలా నగరాన్ని నిజాంలు తీర్చిదిద్దారు. వారు చేసిన అభివృద్ధిని గత పాలకులు కనుమరుగు చేశారు. నదులను కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా మార్చారు. నగరంలోని మురుగుకాల్వలను మూసీకి కలిపారు. ఇలా కలుషితం చేయడంతో నల్గొండ జిల్లాలోని మూసీ పరివాహక ప్రజలు జీవించలేని దుర్భర పరిస్థితి నెలకొంది. ఆ పరిస్థితి నుంచి కాపాడాలని వేలాది మంది విజ్ఞప్తి చేశారని సిఎం తెలిపారు. ఈ నేపథ్యంలో మూసీ సుందరీకరణపై అధ్యయనం చేశాం. ఏడాదంతా నదిలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు రూపొందించాం. మూసీ ప్రక్షాళనకు కన్‌స్టలెంట్ కోసం గ్లోబల్ టెండర్లు పిలిచాం. 3 సంస్థలు జాయింట్ వెంచర్ కింద మూసీ పునరుద్ధరణ పనులు చేపట్టాయి. గోదావరి నుంచి 20 టీఎంసీల నీరు నగరానికి తరలించాలనే ప్రణాళిక ఉందని, అందులో ప్రజల దాహార్తిని తీర్చేందుకు 15 టీఎంసీలు, గండిపేటకు మరో 5 టీఎంసీలు తరలించేలా ఆలోచిస్తున్నామని వివరించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో సుందరీకరణపై లండన్, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్‌లలో అధ్యయనం చేశాం. ప్రపంచస్థాయి నగరాల్లో నదీ పరివాహక ప్రాంతాలను కాపాడుకొని వ్యాపార కేంద్రాలుగా మార్చారు. ఆర్థికవ్యవస్థ బలోపేతానికి ఆయా దేశాలు పోటీపడుతున్నాయి. గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధి కోసం 60వేల కుటుంబాలను తరలించారు. యూపీలో గంగా నదిని ప్రక్షాళన చేసి రివర్‌ఫ్రంట్ ఏర్పాటు చేశారు. ఆ అభివృద్ధిని భాజపా ఎన్నికల అజెండాగా మార్చారు. ఆయా రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను వ్యతిరేకించడం లేదని రేవంత్ వివరించారు. కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని విపక్ష పార్టీలోని పలువురు



కీలక నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమన్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు. ప్రజలకు నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా? అని వారిని ప్రశ్నించారు. వివరాలు చెబుతుంటే నొప్పి ఎందుకు మీకు అంటూ విపక్ష సభ్యులపై ఆయన మండిపడ్డారు. మూసీకి అడ్డంగా పడుకుంటామంటున్న వారు..మొన్న వర్షాలు వచ్చినప్పుడు ఎక్కడికిపోయారంటూ వారిని సీఎం రేవంత్ రెడ్డి కడిగేశారు. కొంతమంది తనను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారని.. రియల్ ఎస్టేట్ సైతం ఒక ఇండస్ట్రీనే అని ఆయన వివరించారు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారని పేర్కొన్నారు. రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతుందని చెప్పారు. రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుందని తెలిపారు. తెలంగాణలో మూసీ నది 240 కిలోమీటర్లు ప్రవహిస్తుందన్నారు. అనంతగిరి హిల్స్ నుంచి వాడపల్లి వరకు మూసీ ప్రవాహం ఉందన్నారు. మూసీ, ఈసీ నదులు కలిసే చోటు బాపుఘాట్ నిర్మిస్తామని.. అందుకే అక్కడ గాంధీసరోవర్ ప్రాజెక్ట్ చేపట్టామని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి జరుగు తుందని పేర్కొన్నారు. మూసీ నది ప్రక్షాళనను మొదట 21 కిలోమీటర్లు చేయాలని చూస్తున్నామని.. హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి చేస్తామని చెప్పారు. మార్చిలో తొలి దశ పనులు ప్రారంభిస్తామన్నారు. సంక్రాంతిలోగా తొలి దశ డీపీఆర్‌పై క్లారిటీ ఇస్తామని పేర్కొన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 51 కి.మీ మూసీ అభివృద్ధి చేస్తామని వివరించారు. 51 కి.మీ ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామన్నారు. మీరాలం ట్యాంక్ కూడా మూసీ అభివృద్ధిలో భాగమేనని స్పష్టం చేశారు. ఈ ట్యాంక్‌పై రూ.450 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. నదులు కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా చేశారని మండిపడ్డారు. నదీ పరివాహక ప్రాంతాల నిర్వాసితులకు ప్రత్యామ్నాయం కోరామని చెప్పారు. మూసీ నది కలుషితం కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటి నుంచి కాపాడాలని వేలాదిగా విజ్ఞప్తులు వచ్చాయన్నారు. ఏడాదంతా మూసీలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఆలయాలు, మసీదులు, గురుద్వారాలు, చర్చి నిర్మిస్తామని తెలిపారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే మూడు నెలల్లో అంచనాలు ఫైనల్ చేస్తామని ప్రకటించారు. ఏడీబీ బ్యాంకు రూ.4,100 కోట్ల రుణం ఇస్తుందన్నారు. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. డిపిఆర్ పూర్తయ్యాక అసెంబ్లీలో చర్చిస్తామని, సభ్యుల సూచనలు కూడా స్వీకరిస్తామని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. మీ నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి కావాలో చెప్పాలని సూచించారు. పేదలకు మంచి ఇళ్లు కట్టించి వారికి మెరుగైన వసతులు కల్పిద్దామని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. తాము మంచి పని చేయాలనుకుంటున్నాం? మీ సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. డీపీఆర్ సిద్ధమయ్యాక ఎమ్మెల్యేలందరికీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి సలహాలు తీసుకుంటామని గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## అంగారక గ్రహంపై నీటి గుహలు..

మొదటి తరువాయి



ఇచ్చేలా ఉన్నది. ఎన్నో ఏళ్ల క్రితమే ఈ గుహలు ఏర్పడినట్లు తేల్చారు. భవిష్యత్తు అన్వేషణలకు ఈ గుహలను స్టడీ చేయనున్నారు. 2025 అక్టోబర్ 30న ఆ అధ్యయనానికి చెందిన డేటాను పబ్లిష్ చేశారు. నాసా శాటిలైట్ల నుంచి సేకరించిన డేటా ఆధారంగా చైనా శాస్త్రవేత్తలు రిపోర్టు ఇచ్చారు.గతంలో గుర్తించిన లావా ట్యూబ్‌లతో పోలిస్తే హిబ్రుస్ వాలీస్‌లో ఉన్న నీటి గుహలు భిన్నంగా ఉన్నట్లు ఆస్ట్రోఫిజికల్ జర్నల్‌లో రాశారు.

## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్


మొదటి తరువాయి



చర్చకు రాలేదని చెప్పారు. సభలో చర్చించే అంశాలను 24 గంటల ముందు పంపాలని డిమాండ్ చేశారు. తాము అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వడం లేదని ఆక్షేపించారు. నిరసనలు తెలిపేందుకు మైక్ ఇవ్వకపోవడం.. ప్రతిపక్షం గొంతు నొక్కడమేనన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో నిరసన తెలపడం ప్రతిపక్ష సభ్యుల హక్కు అని చెప్పారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఏకపక్ష వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. అసెంబ్లీ నుంచి గన్‌పార్క్ వద్దకు కాలినకడన వచ్చిన ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. స్పీకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఇదేమీ రాజ్యం.. దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేశారు. ఇది శాసనసభనా? గాంధీ భవనా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అంతకుముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో మూసీ సుందరీకరణ అంశంపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని వ్యాఖ్యానించారు. దీనిపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఎం వ్యాఖ్యలపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. కానీ అందుకు స్పీకర్ నిరాకరించడంతో బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.


## నేడు కొండగట్టుకు డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్

మొదటి తరువాయి



టీటీడీ నుంచి రూ.35.19 కోట్ల నిధులతో సత్రం, దీక్షా విరమణ మండపం నిర్మాణాలు చేయనున్నారు. ఈ క్రమంలోపవన్ కల్యాణ్ కొండగట్టుకు వెళ్లి.. ఈ నిర్మాణాల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. శనివారం ఉదయం 10గం.30ని. నుంచి 11 గం.30ని. మధ్య డిప్యూటీ సీఎం పవన్ కొండగట్టు క్షేత్రంలో పర్యటించనున్నారు. గతంలో ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న పవన్.. ముక్కులు చెల్లించుకున్నారు. ఆ సమయంలో అక్కడ నిర్మాణాలకు సంబంధించిన అంశాలను అర్చకులు పవన్ కు వివరించారు. కొండగట్టు క్షేత్రంలో నిర్మాణాలపై సీఎం చంద్రబాబుతో పవన్ సమావేశమయ్యారు. టీటీడీ సహకారంతో కొండగట్టు క్షేత్రంలో నిర్మాణాలు చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీఎం చంద్రబాబును కోరారు. చంద్రబాబు ఆదేశాలతో టీటీడీ ఛైర్మన్ తో పవన్ చర్చించారు. అనంతరం రూ.35.19 కోట్లు మంజూరుకు టీటీడీ బోర్డు అంగీకారం తెలిపింది. నిధులతో కొండగట్టు ఆలయంలో దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణాలు చేపట్టనున్నారు. ఒకేసారి 2 వేల మంది భక్తులు దీక్షలు విరమించేలా మండపాన్ని నిర్మించనున్నారు. శనివారం పవన్ తో కలిసి టీటీడీ ఛైర్మన్ బి ఆర్ నాయుడు, ఎమ్మెల్సీ హరిప్రసాద్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం , టీటీడీ బోర్డు మెంబర్లు బి.ఆనందసాయి, ఇతర నేతలు పాల్గొనున్నారు. ఆలయం అభివృద్ధి పనుల శంకుస్థాపన అనంతరం జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు, శ్రేణులతో పవన్ కళ్యాణ్ సమావేశం కానున్నారు. ఆ తర్వాత ఇటీవలి తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో జనసేన మద్దతుతో గెలిచిన వారితో భేటీ అవనున్నారు. ఈ భేటీలు, సమావేశాలు కొడిమ్యాల సమీపంలోని బృందావనం రిసార్టులో జరగనున్నాయి.

## పుతిన్ నివాసంపై డ్రోన్ దాడులు




వీటిని తమ ప్రత్యేక నిపుణులతో పరిక్షించగా.. డ్రోన్ల దాడి లక్ష్యం నోవ్‌గొరొడ్ ప్రాంతం లోని పుతిన్ నివాసమేనని నిర్ధరణ అయ్యిందన్నారు. ఈ సందర్భంగా ఆ వివరాలన్నింటినీ కోస్ట్యుకోవ్ అమెరికాకు అప్పగించారు. ఇక, ఉక్రెయిన్ ఈ దాడి చేసిందంటూ రష్యా చేస్తున్న ఆరోపణలను ఆ దేశం ఖండించింది. నాటో దేశాలు కూడా మాస్కోకు మద్దతివ్వలేదు. మరోవైపు కీవ్ దాడికి యత్నించినట్లు ఎలాంటి ఆధారాలు లేవని యూఎస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కూడా వెల్లడించినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో దాడి ఆధారాలను రష్యా అమెరికాకు ఇవ్వడం గమనార్హం. ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం ముగించడానికి చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఈ దాడితో అమెరికాకు కూడా మింగుడుపడడం లేదు. ఇది ట్రంప్ తీసుకున్న చర్యలకు విఘాతంగా మారనుంది.

## ఢిల్లీని కమ్మేసిన పొగమంచు..

మొదటి తరువాయి

సూచిక కూడా చాలా పేలవమైన వర్గంలో నమోదైంది. శుక్రవారం ఉదయం నగరంలో ఏక్యూఐ లెవెల్స్ 386గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. 26 ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో గాలి నాణ్యత వెరీ పూర్ కేటగిరీలో నమోదైంది. అత్యధికంగా ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 423గా నమోదైంది.

## బ్లడ్‌లో తిరిగే బుల్లి రోబోలు..

మొదటి తరువాయి

అక్కడికే ఔషధాన్ని చేరవేయడం సవాలుతో కూడుకున్నది. ఇందుకు మెరుగైన పద్ధతుల కోసం శాస్త్రవేత్తలు ఎప్పటి నుంచో పరిశోధనలు చేస్తున్నారు. ప్రస్తుతం చాలా వ్యాధులకు ఎక్కువ డోస్‌తో కూడిన మందులు ఇచ్చి, శరీరమంతా డిస్ట్రిబ్యూట్ చేయాల్సి వస్తున్నది. దీని వల్ల దుష్ప్రభావాలు తలెత్తుతున్నాయి.ఈ సమస్యకు ఈ మినీ రోబోలు పరిష్కారం చూపుతాయని భావిస్తున్నారు. ఈ రోబోలు వాటంతట అవే నడవవు. బయటి నుంచి మ్యాగ్నెట్ ద్వారా వైద్యులు వీటిని ఆపరేట్ చేస్తారు. తద్వారా ఇవి శరీరంలో కోరిన చోటకు ఔషధాన్ని తీసుకువెళ్తాయి. వేగంగా ప్రవహించే రక్తానికి వ్యతిరేకంగానూ ఇవి ఈదగలవు. సెకనుకు 20 సెంటీమీటర్ల మేర కదలగలవు. వీటి రాకతో హెవీ డోస్ ఇంజెక్షన్ల అవసరం తప్పుతుందని వైద్యులు భావిస్తున్నారు. మనుషులపై పరీక్షలు పూర్తయితే, త్వరలోనే ఇవి హాస్పిటళ్లలో అందుబాటులోకి రానున్నాయి.

## కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిందే

మొదటి తరువాయి

కేసీఆర్ మీద సీఎం భాష సరికాదన్నారు. కేసీఆర్‌ను ఒకసారి ఉరితీయాలంటే రేవంత్ రెడ్డిని పదిసార్లు ఉరి తీయాలంటూ మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో కవిత మాట్లాడుతూ.. ఈ సమావేశాలకు కేసీఆర్ వచ్చి సమాధానాలు చెప్పకపోతే బీఆర్ఎస్ పని ఖతం అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తప్పు చేయకపోతే సభకు రావాల్సిందే అని పట్టుబట్టారు. సభకు రాకుండా పిల్ల కాకుల మీద సభా సమయాన్ని వదలొద్దంటూ హితవుపలికారు. ఈ విషయంలో ఒక కూతురుగా తన రక్తం ఉడుకుతోందన్నారు. ఉద్యమకారుడిని ఉరితీయాలని అంటే రక్తం మరుగుతోందని చెప్పారు. శాసన మండలి వద్ద మీడియాతో ఆమె చిట్‌చాట్ నిర్వహించారు. నా రాజీనామా ఆమోదం కోరేందుకు మండలికి వచ్చాను. కేసీఆర్‌పై రేవంత్ వ్యాఖ్యలు సరికాదు. కృష్ణా జలాలపై అసెంబ్లీలో కేసీఆర్ మాట్లాడి నోరు మూయించాలి. బీఆర్ఎస్ మనుగడ కొనసాగాలంటే ఆయన అసెంబ్లీకి రావాలి. నదీ జలాల అంశాన్ని పిల్లకాకుల మీద వదిలేయవద్దు. బీఆర్ఎస్‌లో బబుల్ షూటర్లకే డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్ పదవులు ఇచ్చారని కవిత వ్యాఖ్యానించారు. సొంత జిల్లా మహబూబ్ నగర్‌కు రేవంత్ తెచ్చిన ప్రాజెక్టులు ఎన్ని అని ప్రశ్నించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావును ఉద్దేశించి కవిత మరోసారి తీవ్రమైన ఆరోపణలు చేశారు. హరీష్ రావు ఒక బచ్చా అని అన్నారు. ఆయనకు ప్యాకేజీలు తీసుకోవడం తప్ప ఏం తెలుసు అంటూ హరీష్‌ను టా÷-గ్గ్÷ట్ చేస్తూ కవిత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారింది. కేసీఆర్ సభకు రాకపోతే హరీష్ రావే అన్నీ చూసుకోవడం సరికాదని.. కేసీఆర్ సభకు వచ్చి సమాధానం చెప్పాలని కవిత వ్యాఖ్యలు చేశారు.

## కవిత కేసీఆర్ వదిలిన బాణమే

మొదటి తరువాయి

అంటూ కవితను ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఇక బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. సీఎం స్పందనపై కవిత శుక్రవారం కాస్తా ఘాటుగా స్పందించారు. దీనికి కోమటిరెడ్డి ఘాటుగా స్పందించారు. తనకు సీఎం రేవంత్ రెడ్డి అంటే గౌరవమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని ఎవరు ఏమన్నా అంటే కౌంటర్ ఇస్తానన్నారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మంత్రి పదవి కోసం తాను ఏ రోజు పాకులాడలేదని చెప్పారు. మంత్రి పదవి కావాలంటూ తాను ఎవరిని అడగలేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం మంత్రి పదవినే తాను త్యాగం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తనకు, తన తమ్మునికి మధ్య ఎటువంటి గొడవలు లేవని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జనవరి 1వ తేదీ గురువారం సాయంత్రం ప్రజాభవన్‌లో జలాలు – నిజాలు అంశంపై తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు. దీనికి కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు పార్టీలోని సీనియర్లు పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు వల్లే తగ్గిదంటూ సీఎం రేవంత్ కాస్తా ఘాటుగా స్పందించారు. సీఎం చేసిన వ్యాఖ్యలపై కవిత మండిపడ్డారు. కవిత వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.

# ఏఆర్ క్యూ స్కూల్ కు ఏడు ప్రపంచ రికార్డులలో చోటు





**-వెల్లడించిన ప్రపంచ రికార్డుల జాతీయ సమన్వయ కర్త లయన్ కె.వి. రమణారావు**

**-విద్యార్థుల ప్రతిభను కొనియాడిన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**

**హైదరాబాద్, జనవరి 02 (అక్షర వేదం) :** ఏఆర్ క్యూ వ్యాలీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ అమోఘమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కొనియాడారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన అద్భుతాలు అందర్నీ ఆశ్చర్యపరిచాయి. వారి ప్రతిభను ఏడు ప్రపంచ రికార్డులలో నమోదు చేసినట్లుగా జాతీయ కో-ఆర్డినేటర్ లయన్ కె.వి.రమణారావు అతిథుల సమక్షంలో ప్రకటించిన ప్రపంచ రికార్డుల పేర్లు వరుసగా యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, భారత్ వరల్డ్ రికార్డ్స్, జీనియస్ గ్లోబల్ రికార్డ్స్, టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఇండియా ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్, జీనియస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్స్, అమేజింగ్ కిడ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ తదితర రికార్డులలో నమోదైన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూతమ అద్భుత నైపుణ్యంతో 7 ప్రపంచ




రికార్డులు సాధించి ప్రపంచ పుటలలోకి చేరిన ఏఆర్ క్యూ వ్యాలీ స్కూల్ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. సుమారు 45 మంది విద్యార్థులు బ్లైండ్ ఫోల్డ్ ద్వారా ప్రదర్శించిన సిక్స్ సెన్స్ అద్భుతాలు అందరిని అబ్బుర పరిచాయని ప్రశంసించారు. తనకు తెలిసి ఆంధ్ర ప్రదేశ్ లోనే ఈ స్కూలు విద్యార్థులు మాత్రమే ఈ ఘనత సాధించారని అన్నారు. విద్యార్థులను ఇంత అద్భుతంగా తీర్చిదిద్దిన స్కూలు చైర్పర్సన్ డాక్టర్ మజ్జి సాయి లక్ష్మికి అభినందనలు తెలియజేశారు. బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, సూపరిండెంట్ అఫ్ పోలీస్ వి.విద్యాసాగర్ నాయుడు, ప్రముఖ నటుడు ప్రసన్నకుమార్ తదితరులు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రావడం, పిల్లలు చేసే అద్భుతాల చూడటం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. కళ్లకు గంతలు కట్టుకొని అక్షరాలను, బొమ్మలను, రంగులను గుర్తించడం అనేది సామాన్య విషయం కాదన్నారు. నిజంగా విద్యార్థులు రికార్డులకు అర్హులని కొనియాడారు. ఏఆర్ క్యూ వ్యాలీ స్కూల్ ఛైర్ పర్సన్ డాక్టర్ మజ్జి సాయి లక్ష్మీ మాట్లాడుతూ సాధన ద్వారా ఏదైనా సాధించవచ్చని తమ విద్యార్థులు నిరూపించారని కొనియాడారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే ఈ కార్యక్రమం ఒక ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా ఒక శక్తి ఉంటుందని దానిని సరైన విధంగా సద్వినియోగం చేసుకుంటే మానసికంగా, శారీరకంగా ఉన్నతంగా ఎదగడంతోపాటు జీవితంలో పరిపూర్ణత సాధించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యార్థులు 7 ప్రపంచ రికార్డులు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి తమ పిల్లలకు ఆశీస్సులు అందజేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ రికార్డ్స్ ఆర్గనైజేషన్స్ జాతీయ కో-ఆర్డినేటర్ లయన్ కె.వి.రమణారావు, ప్రముఖ నిర్మాత బుగత నర్సింగరావు, ప్రముఖ సినీ నటులు ప్రసన్నకుమార్, నటుడు ఆలీ, వ్యాఖ్యాత సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలిండియా మహిళా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎస్తేర్ రాణి

**-ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రముఖులు**

**హైదరాబాద్, జనవరి 02 (అక్షర వేదం) :** గత 30 సంవత్సరాలుగా మహిళాభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేకించి కాంగ్రెస్ పార్టీ మహిళా కాంగ్రెస్ లో అంచెలంచెలుగా ఎదిగి ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎస్తేర్ రాణి అపాయింట్ అయినందుకు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ శాలువా, పూలమాల జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. డా.రాజనారాయణ మాట్లాడుతూ చిన్నప్పటినుండి ఈస్టర్ రాణి విద్యార్థి దశ నుండి



నేటి వరకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకించి మహిళా కాంగ్రెస్ లో చురుకుగా పాల్గొని కాంగ్రెస్ పార్టీ ఐక్యతకు అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో పరిశీలకు రాలిగా వెళ్లి అభ్యర్థులు గెలవడానికి తన వంతు కృషి చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఆమె జన్మదినం కూడా జరుపుకున్నందుకు కేకులు కట్ చేసి శాలువా, పూలమాల, జ్ఞాపికతో వివిధ మహిళ కాంగ్రెస్ నాయకులు, న్యాయవాదులు, విద్యావేత్తలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా.డి.ఆదంరాజ్, కుమార్ రావు, డా.రవిబాబు, మహిళా సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆకుల లలిత, ఇందిరా రావు, జ్యోతి, ప్రియదర్శిని, రమ్యారావు, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి తరుణ్, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ కో-ఆర్డినేటర్ బిచ్చుకారి సూర్య తదితరులు పాల్గొని ఎస్తేర్ రాణికి శుభాకాంక్షలు తెలిపారు.

# అదనపు కలెక్టర్ జిల్లా, పశుసంవర్ధక అధికారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

**- టిఎన్జీవో మంచిర్యాల జిల్లా కమిటీ**

**అక్షర వేదం, మంచిర్యాల, జనవరి 02** మంచిర్యాల జిల్లా టిఎన్జీవో అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి. చంద్రయ్య ని, జిల్లా పశు సంవర్ధక అధికారి ఈ.శంకర్ ని నూతన సంవత్సరమును పురస్కరించుకొని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి పుష్ప గుచ్ఛం తో సన్మానం చేయడం జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ ) పి.చంద్రయ్య మాట్లాడుతూ జిల్లా లోని రెవెన్యూ ఉద్యోగులందరూ నిరంతరాయంగా కష్టపడి భూభారతి అమలు చేయడం లో, ఇతర రెవెన్యూ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం లో మంచిర్యాల జిల్లా నెంబర్ వన్ స్థానంలో ఉండాలని తెలపడం జరిగినది.తదుపరి జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా తెలంగాణ రాష్ట్రం లోనే మంచిర్యాల జిల్లా భూభారతి, ఇతర రెవెన్యూ పథకాలలో మొదటి స్థానంలో ఉండడానికి ఉద్యోగులు అందరం నిరంతరం కృషి చేస్తారని



తెలుపడం జరిగినది. ఈ వేడుకలలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, కోశాధికారి సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కేజియా రాణి, రాంకుమార్, తిరుపతి, అంజయ్య, సంయుక్త కార్యదర్శి సునీత, ప్రభు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రావణ్ కుమార్, స్పోర్ట్స్ సెక్రటరీ అనురాగ్, ప్రచార కార్యదర్శి యూసుఫ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్,కార్యదర్శి అజయ్ ప్రశాంత్,మందమర్రి యూనిట్ అధ్యక్షులు సుమన్, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షులు వెంకటేష్, లక్షెట్టిపేట యూనిట్ అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు సదానందం,మోసిన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వంతో పోగొట్టుకున్న పర్సు అప్పగింత




**అక్షర వేదం, జైపూర్, జనవరి 02** మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పడిపోయిన పర్సును బాధితుడికి జైపూర్ పోలీసులు అందజేశారు.గురువారం స్థానిక గ్రామానికి చెందిన యువకుడు షారుక్ తన సొంత పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటికి రాగా ప్రధానరహదారిపై పర్సు దొరికింది. అందులో రూ4500 నగదు ఉన్నాయి. పర్సులో ఉన్న ఫోన్‌నెంబర్‌కు సమాచారం అందించాడు. భీమారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బాధితుడు ఆటో డ్రైవర్ జాడి తిరుపతికి,సిఐ నవీన్ కుమార్, ఎస్సై శ్రీధర్ సమక్షంలో పర్సు అందజేశారు.పోయిన పర్సును తిరిగి అందించి, మానవత్వం చాటినందున ఈ సందర్భంగా పోలీసులు షారుక్ ను అభినందించారు.

# రోడ్డు ఇరువైపులా చెట్ల కొమ్మలను తొలగించిన సర్పంచ్



**అక్షర వేదం, జైపూర్, జనవరి 02** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని ముదిగుంట గ్రామ సర్పంచ్ రవికుమార్ వాహనదారుల అభ్యర్థన మేరకు స్పందించాడు.స్థానిక గ్రామంలోని ప్రధాన రహదారిలో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను పంచాయతీ సిబ్బంది సాయంతో శుక్రవారం ట్రిమ్మింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల రాకపోకలకు రహదారికి ఇరువైపులా ఏపుగా చెట్లు పెరిగి వాహనాదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని కొమ్మలను తొలగించామని తెలిపారు. స్థానిక గ్రామం మీదుగా ప్రయాణించే ఇతర గ్రామాల వారితోపాటు స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేద్దాం

**- బచ్చన్నపేట సర్పంచ్ ఆల్వాల నర్సింగరావు**



**బచ్చన్నపేట జనవరి 02(అక్షరవేదం):-** గ్రామాభివృద్ధికి అందరం కలిసి కట్టుగా పనిచేద్దామని బచ్చన్నపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఆల్వాల నర్సింగరావు,అన్నారు.శుక్రవారం బచ్చన్నపేట గ్రామపంచాయతీ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వార్డు మెంబర్లతో కలిసి అయన మాట్లాడుతూ.గ్రామంలోని 14 వార్డుల్లో నెలకొన్న సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేద్దామన్నారు.ప్రజలకు నిత్యం తాగునీరు, వీధిదీపాల నిర్వాహణ, పారిశు ద్యంపై ప్రత్యేక దృష్టి పెడుతామన్నారు.ఎక్కడ సమస్య ఉన్నా గ్రామ పంచాయతీకి,తనకు సమాచారం అందిస్తే దాన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తూ.గ్రామాభివృద్ధికి నిరంతరం పాటు పడదామన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బైరు రజిత,వార్డు సభ్యులు, పురాణం శ్రీనివాస్,కర్రె ప్రశాంత్,తవుటి భవాని,గర్నేపల్లి అంజయ్య, శివరాత్రి రాజు,దిడ్డిగ చంద్రమ్మ,కర్రె భాస్కర్, దేవరకొండ మల్లేష్,కక్కెర్ల ఉమారాని,కక్కెర్ల విజయలక్ష్మి,గందమల్ల మాదవి,ముద్దసాని స్వప్న, కనకం లావణ్య,తదితరులు పాల్గొన్నారు.

# యాదవులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలి

**-యాదవుల ఐక్యతే యాదవ జేఏసీ ప్రథమ లక్ష్యం**
**-యాదవ జేఏసీ చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్**
**-యాదవ ప్రముఖులను కలిసిన యాదవ జేఏసీ నేతలు**



**హైదరాబాద్, జనవరి 02 (అక్షర వేదం) :** యాదవుల ఐక్యత రాజ్యాధికారమే లక్ష్యంగా యాదవ జేఏసీ పని చేస్తుందని యాదవ జేఏసీ చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం హైదారాబాద్ లో అంబర్ పేట్ శ్రీనివాస్ యాదవ్, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ లను యాదవ జేఏసీ నేతలు మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదవ జేఏసీ చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు. పోరాటాల ద్వారానే యాదవుల హక్కులు సాధ్యమవుతాయన్నారు. యాదవులు విద్య, ఉద్యోగ, ఆర్థిక రాజకీయ, వ్యాపార రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ జేఏసీ వైస్ చైర్మన్ చిలుకల శ్రీనివాస్ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అంజి యాదవ్, యాదవ జేఏసీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి విద్యార్థులకు దుస్తుల పంపిణీ



**అక్షర వేదం, జైపూర్, జనవరి 02** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పెగడపల్లి అంగన్వాడి కేంద్రశీలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక సర్పంచ్ రామగిరి రామన్న తో కలిసి టీచర్ విజయ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామన్న మాట్లాడుతూ యూనిఫామ్ ద్వారా సమానత్వం, క్రమశిక్షణ, ఏకత్వం, భద్రతను ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు. ఆర్థిక వ్యత్యాసాలను తగ్గిస్తాయన్నారు.విద్యపై దృష్టి పెట్టడానికి సహాయపడతాయని తెలిపి, పాఠశాల గుర్తింపును పెంచుతాయన్నారు. ఏకరూప దుస్తుల వలన సామాజిక స్ఫూర్తిని చిన్న తనం నుండి పిల్లల్లో పెంచవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు రిక్కుల సంతోష్ రెడ్డి , సర్పంచ్ రామగిరి రాము, కార్యదర్శి పావని, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మండల ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల సందర్శించిన నూతన సర్పంచ్



**అక్షర వేదం/మహాదేవపూర్, జనవరి 2:** అన్నారం గ్రామపంచాయతీ సర్పంచ్ నిర్ల ప్రభాకర్ ఎంపీ యుపిఎస్ అన్నారంను సందర్శించి అక్కడ ఉన్న పిల్లలను,ఉపాధ్యాయులు సమీకరించి, స్కూల్లో ఉన్నటువంటి వసతుల గురించి తెలుసుకోవడం జరిగింది. తప్పకుండా ప్రభుత్వం పంపే సరుకులు విద్యార్థులకు పౌష్టికా హారం అందించాలని తగు సూచనలు చేయడం జరిగింది. అదేవిధంగా పాఠశాలలోని ఎలాంటి అవసరం ఉన్న మా దృష్టికి తీసుకువచ్చినట్టయితే వాటిని తప్పకుండా త్వరితగతిన పరిష్కరిస్తామని తెలియ పరచడం జరిగింది. ఉపాధ్యాయులు ,విద్యార్థులు నూతన సర్పంచిని చాలువ తో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన సంవత్సర సందర్భంగా పిల్లలకు స్వీట్ పంచడం జరిగింది .అలాగే పాఠశాల సందర్శన అనంతరం గ్రామపంచాయతీ ప్రేగ్రగేషన్ షెడ్డు సందర్శించి అక్కడ పనిచేస్తున్న ఎంపీడబ్ల్యూ వర్కర్లకు తప్పకుండా సేకరించిన చెత్తను వేరు చేస్తూ, కంపోస్ట్ ప్రిపరేషన్ చేయాలని దాని ద్వారా వచ్చిన రూపాయలను గ్రామ పంచాయితీ అభివృద్ధికై వినియోగించాలని తగు విలువైన సూచనలు గ్రామ కార్యదర్శి సమక్షంలో తెలియపరచడం జరిగింది.

# మహారాష్ట్ర దేశదారు మద్యం పట్టివేత



**అక్షర వేదం, జైపూర్, జనవరి 02** మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహారాష్ట్ర దేశి గారు మద్యం స్థానిక పోలీసులు పట్టుకున్నారు.సాధారణ తనిఖీలలో భాగంగా స్థానిక మండల కేంద్రంలోని పవర్ ప్లాంట్ ఎదుట ఎస్సై శ్రీధర్ సిబ్బందితో కలిసి గుర్తించినట్లు సీఐ నవీన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరవై ఐదు కాటన్లలో సుమారు లక్ష రూపాయల విలువ చేసే సారాయిని పట్టుకున్నామని వివరాలు వెల్లడించారు.మహారాష్ట్ర చంద్రపూర్ కు చెందిన నిఖిల్ రాజు తన సొంత కారు షిఫ్ట్ డిజైర్ వాహనంలో చంద్రపూర్ నుండి ఐరి మహారాష్ట్రకు అక్రమంగా దేశిదారు మద్యం బాటిల్లు తరలిస్తున్నట్లు కనుగొన్నామన్నారు.మొత్తం 2500 దేశి దారు బాటిల్లు, 90ఎంఎల్ గలవి,సుమారు లక్ష రూపాయల విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు.ఈ మేరకు నిందితుడి అదుపులోకి తీసుకొని, మద్యం తరలిస్తున్న కారును సీజ్ చేశామన్నారు.

# ప్రజా సమస్యలు పత్రికల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి

**– జనసముద్రం న్యూస్ క్యాలెండర్ ఆవిష్కరించిన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**అక్షర వేదం, మంచిర్యాల,జనవరి 2** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకొని వచ్చే విధంగా పత్రికలు, పనిచేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు, శుక్రవారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జనసముద్రం న్యూస్ పత్రిక 2026 సంవత్సరం క్యాలెండర్ ను ఆవిష్కరించారు, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం ద్వారా, వాటిని పరిష్కరించడానికి వీలవుతుందని, అలాగే ప్రజల కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రచురించడం ద్వారా ప్రజలు పథకాలను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుందని, సమాజంలో పత్రికలకు చాలా గౌరవం ఉంటుందని, నకిలీ వార్తలు ప్రచురించకుండా, వాస్తవాలను ప్రచురించడం ద్వారా పత్రిక యొక్క గొప్పతనం పెరుగుతుందని , జనసముద్రం న్యూస్ ప్రజల పక్షాన పనిచేయాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సిరిపురం మధుకర్, పివిఆర్ న్యూస్ చైర్మన్ తాళ్లపల్లి రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

# ఎగ్లాస్పూర్ గ్రామం వద్ద ప్రమాదం

**అక్షర వేదం/మంథని,జనవరి 02:** మల్క రవిందర్ తండ్రి లస్మయ్య కులం మున్నూరు కాపు 51వృత్తి వ్యవసాయం. ఎక్లాస్పూర్ 1/1/2026 రోజున సుమారు 4:30 ప్రాంతంలో నా బామ్మర్ది బొడ్డు రమేష్ 30 ఏక్లాస్ పూర్ అతని భార్య శ్రీలత రమేష్ 38 బైకు AP15P 5062 వారు ఇంటి నుండి బయలుదేరి మంథనికి వస్తుండగా మార్గం మధ్యలో బ్యాంకేట్ హాల్ దగ్గరకు రాగానే సాయంత్రం 4:45 గంటల కు రోడ్డు దాటిన తర్వాత రేగటి నారాయణ పొలం 8453 అనుదాన్ని నడుపుతు మంథని వైపు వస్తున్న వ్యక్తి అతని మోటార్ సైకల్ ను అతి వేగంగా నడుపుతూ వచ్చి మా బామ్మర్జి నడుపుతున బైకును వెనకల నుండి డీకొట్టగా మా బామ్మర్ది అతని భార్య మోటార్ సైకిల్ పై నుండి క్రింద పడగా తలకు రక్త గాయాలు మా బామ్మర్థి రమేష్ చేతులకు రక్త గాయాలు అయినవి.మంథని వైపు నేను వెళ్తుండగా వారిని చూసి వెంటనే మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెల్లి ప్రథను చికిత్స డాక్టర్ చేయగా మెరుగైన వైద్యం గురించి కరీంనగర్ లోని అపోలో రాక్ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్ళినాము.ప్రస్తుతం అక్కేడే చికిత్స చేయించారు.చికిత్స చేయించడం వలన దరఖాస్తు ఆలస్యమైంది.మోటారు సైకిల్ నడిపిన వ్యక్తి అడిచర్ల రాజయొళి శ్రీరాంపూర్ కావున అతడిపై తగు చర్య తీసుకోని న్యాయం చేస్తురని పోలీసు సిబ్బందికి తెలియజేశారు..

# మంచినీటి సరఫరా కోసం, మోటారు, విద్యుత్ పరికరం ప్రారంభం



**అక్షర వేదం/మహాముత్తారం జనవరి 2:** మహాముత్తారం మండల కేంద్రంలోని 4 వ వార్డు , 5వ వార్డుకు మంచినీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ మోటార్ , స్టాటర్ చెడిపోవడంతో, మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో నూతనంగా ఎన్నికైన సర్పంచి కొండగొర్ల బాపు, కొత్త మోటార్ ,కరెంటు, స్టార్టర్ ను బిగించి మంచినీటికి అంతరాయం కలగకుండా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామినేని పూజిత, వార్డు మెంబర్లు బచ్చల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# బోర్లగూడెంలో విధి లైట్ల ఏర్పాట్లు.

**సర్పంచ్ అజ్మీరా దరం సింగ్**



**అక్షర వేదం/మహాముత్తారం, జనవరి 2:** మహాముత్తారం మండలం బోర్ల గూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఆగ్రో ఫౌండేషన్ సహకారంతో 16 వీధిలైట్లు ఏర్పాటు చేసినట్లు బోర్ల గూడెం గ్రామ సర్పంచ్ అజ్మీరా దరం సింగ్ తెలిపారు. హనుమాన్ నగర్, నాయకపోడ్ కాలనీ, హనుమాన్ టెంపుల్, బాలాజీ టెంపుల్,మెన్ రోడ్, గాజురాంపల్లి, సోలార్ ఇది లైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు అంకితం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పక్షాన ఆగ్రో ఫౌండేషన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో ఫౌండేషన్ డైరెక్టర్ శంకర్, కాటారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గంట కొండారెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ముదురుకోళ్ల రవి, ఆగ్రో ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ బోర్ల గూడెం చైర్మన్ జాగరి మల్లేష్ పాల్గొన్నారు.జుఅస

# మహాముత్తారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్



**అక్షర వేదం/మహాముత్తారం, జనవరి 2:** మహాముత్తారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాటర్ ప్యూరిఫైయర్ ద్వారా త్రాగు నీళ్లు అందించేందుకు ఆర్వో ప్లాంట్ ప్రారంభించడం జరిగింది. ఇట్టి ప్రారంభం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ కొండ గొర్ల బాపు మాట్లాడుతూ, విద్యార్థులకు మంచినీరు అందించడం, ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకొని శారీరక దృఢత్వాన్ని పెంచుకొని మానసికంగా సిద్ధమై చదువుపై దృష్టిని సారించవచ్చని అన్నారు. తహసిల్దార్ దండు శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలకు ఆర్వో ప్లాంట్ ను అందజేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మండల అభివృద్ధి అధికారి నిశాంత్ మాట్లాడుతూ పాఠశాలల్లో పరిశుద్ధమైన త్రాగునీరు అందించేందుకు చేసిన ప్రయత్నమే చాలా గొప్పదని, కెంట్ అందించిన వారిని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీ ఏ సురేందర్, మాజీ జెడ్ పి టి సి లింగమల్ల శారద దుర్గయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గంట్ల దేవేందర్ రెడ్డి, కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ రాజమల్లు,గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ శైలజ , ఉప సర్పంచ్, రామ్నేని పూజిత, వార్డ్ మెంబర్లు, నాయుడు మంథమ్మా, బచ్చల లక్ష్మణ్,స్థానిక సీనియర్ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు లావుడియా ప్రకాష్, హాట్కర్ దేవ్ సింగ్ జాటోత్ రాంసింగ్, భూఖ్య మంజుల, రఘుపతి రెడ్డి, మధుకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రోజూ 325 ఎంజీ ఆస్ప్రిన్ తీసుకుంటున్న ట్రంప్

**న్యూయార్క్::- జనవరి 02 అక్షర వేదం**
ఆరోగ్యం పర్ఫెక్ట్‌గా ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. అయితే డాక్టర్లు సూచించిన మోతాదు కన్నా ఎక్కువ మోతాదులో ఆస్ప్రిన్ మందు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. చేతులకు ఉన్న గాయాల్ని కనిపించకుండా ఉండేందుకు మేకప్ వేసుకోనున్నట్లు చెప్పారు. రెగ్యులర్‌గా వ్యాయామం చేయడానికి తన ఇష్టం లేదన్నారు. ద వాల్ స్ట్రీట్ జర్నల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎంఆర్ఐ స్కానింగ్ చేయించుకున్నట్లు గతంలో చెప్పానని, కానీ వాస్తవానికి గత అక్టోబర్‌లో తాను సీటీ స్కాన్



మాత్రమే చేయించుకున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు.ట్రంప్ వయసు ప్రస్తుతం 79 ఏళ్లు. అమెరికా చరిత్రలో అత్యంత వృద్ధ అధ్యక్షుడు ఆయనే. వృద్ధాప్య సమస్యలు ఆయన్ను బాధిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని మీటింగ్‌ల్లో ఆయన కునుకు తీస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రశ్నలు వినబడడం లేదు. గత 25 ఏళ్ల నుంచి మోతాదుకు మించి ఆస్ప్రిన్ మందును తీసుకుంటున్నట్లు ట్రంప్ తెలిపారు. గాయాలు త్వరగా అవుతాయని తెలిసినా తప్పడం లేదన్నారు. రక్తాన్ని పలుచగా మార్చేందుకు ఆస్ప్రిన్ ఉత్తమమైన మందు అని, గుండెలో ముదిరిన రక్తం ప్రవహించడం నాకు ఇష్టం లేదని ట్రంప్ అన్నారు. ప్రతి రోజు 81 ఎంజీ డోసు ఆస్ప్రిన్ తీసుకోవాలని డాక్టర్లు సూచించారు, కానీ ట్రంప్ మాత్రం ప్రతి రోజూ 325 ఎంజీ ఆస్ప్రిన్ తీసుకుంటున్నట్లు తెలిసింది.

## మరోసారి బహిరంగంగా కనిపించిన కిమ్ కుమార్తె


**న్యూఢిల్లీ:జనవరి 02 అక్షర వేదం**
ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ కుమార్తె కిమ్ జు యే కు ఆ దేశంలో ప్రాధాన్యత పెరుగుతోంది. గత మూడేళ్లుగా తండ్రి కిమ్‌తో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ కిమ్ జు యే అంతర్జాతీయ మీడియాను ఆకర్షిస్తున్నారు. ఆమెను కిమ్ వారసురాలిగా స్థానిక మీడియా పేర్కొంటోంది.ఈ నేపథ్యంలో కిమ్ జు యే తాజాగా మరోసారి బహిరంగంగా కనిపించారు. తన తల్లిదండ్రులతో కలిసి దేశ మాజీ నేతల స్మారక ప్రదేశం 'కుమ్‌సుసన్' స్మారకాన్ని ఆమె సందర్శించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని దేశ మాజీ నాయకులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి పలువురు సీనియర్ అధికారులు కూడా హాజరయ్యారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు వీడియోలు



వైరల్‌గా మారాయి.2009లో రి సోల్ జుతో కిమ్‌కు వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. అయితే, ముగ్గురు పిల్లల్లో కేవలం కుమార్తె జు యే గురించి మాత్రమే బయట ప్రపంచానికి తెలిసింది. ఆమె అంటే కిమ్‌కు చాలా ఇష్టమట. 2022లో తొలిసారి జుయేని కిమ్ ప్రపంచానికి పరిచయం చేశారు. అప్పటి నుంచి తండ్రితోపాటూ పలు అధికారిక కార్యక్రమాల్లో జుయే మెరిశారు.ఇటీవలే ఆమెను తొలిసారి విదేశీ పర్యటనకు కూడా తీసుకెళ్లారు కిమ్. గతేడాది సెప్టెంబర్ 2న చైనా పర్యటనకు తీసుకెళ్లారు. చైనా విజయోత్సవాల సందర్భంగా జరిగిన సైనిక కవాతుకు వీరు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పాల్గొన్నారు. ఇలాంటి హై ప్రొఫైల్ ఈవెంట్‌లో ఆమె పాల్గొనడాన్ని బట్టి కిమ్ జోంగ్ ఉన్‌కు భావి వారసురాలిగా ఆమెను పరిచయం చేస్తున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఉత్తర కొరియాకు కాబోయే నేత ఆమే అన్న సందేహాలు నెలకొన్నాయి.

## గిగ్ వర్కర్ల అర్హతకు కేంద్రం ప్రతిపాదనలు

### సమ్మెతో దిగొచ్చిన కేంద్రం




**న్యూఢిల్లీ:- జనవరి 02 అక్షర వేదం**
గిగ్‌వర్కర్ల సమ్మె పిలుపుతో ఫుడ్ యాప్‌లతో పాటు తాజాగా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చింది. ఒక ఆర్థిక సంవత్సరంలో డెలివరీ బార్సు ఒక అగ్రిగేటర్ వద్ద కనీసం 90 రోజులు పని చేస్తే సామాజిక భద్రత కల్పిస్తూ కేంద్రం ముసాయిదా పత్రాన్ని విడుదల చేసింది. ఒకటి కంటే ఎక్కువ అగ్రిగేటర్ల వద్దనైతే 120 రోజులు పని చేయాలని పేర్కొంది. గిగ్ వర్కర్ ఒకే రోజు ముగ్గురు అగ్రిగేటర్ల వద్ద పనిచేస్తే దానిని మూడు రోజులుగా పరిగణిస్తారు. నేరుగా లేక పరోక్షంగా అగ్రిగేటర్‌తో కలిసి పనిచేసే వారిని గిగ్ వర్కర్‌గా గుర్తిస్తామని కేంద్రం పేర్కొంది. ఇ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి గుర్తింపు కార్డు జారీ చేస్తారని, సామాజిక భద్రత ప్రయోజనాలు అందుతాయని పేర్కొంది. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు గత నెల 25, 31 తేదీల్లో సమ్మె చేపట్టడంతో స్విగ్గీ, జొమాటో ప్రోత్సాహకాలు ప్రకటించగా, కేంద్రం ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ముసాయిదాను డిసెంబర్ 30న విడుదల చేసింది.

## జమ్ము టోర్నమెంట్‌లో పాలస్తీనా జెండా ప్రదర్శన..

### క్రికెటర్‌పై విచారణ



**శ్రీనగర్ :జనవరి 02 అక్షర వేదం**
దక్షిణ కాశ్మీర్‌కి చెందిన ఒక క్రికెటర్ పాలస్తీనా జెండాతో కూడిన హెల్మెట్ ధరించడంతో పోలీసులు విచారణకు ఆదేశించారని సీనియర్ అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు. గురువారం జమ్ములో జరిగిన జెకె చాంపియన్స్ లీగ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది.పుల్వామాకి చెందిన క్రికెటర్ ఫుర్కాన్ ఉల్ హక్ తన హెల్మెట్‌పై పాలస్తీనా జెండాను ప్రదర్శిస్తూ కనిపించిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. సమస్య సున్నితత్వం, శాంతిభద్రతల దృష్ట్యా ఆ వ్యక్తి ఉద్దేశం, నేపథ్యం, వాస్తవాలు మరియు ఇతర అంశాల గురించి తెలుసుకునేందుకు దోమన పోలీస్‌స్టేషన్‌లో బిఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 173(3) కింద 14 రోజుల ప్రాథమిక విచారణ ప్రారంభించబడిందని ఆ అధికారి పేర్కొన్నారు. పాలస్తీనా జెండాను ప్రదర్శించడంపై జమ్ముకాశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ టోర్నమెంట్‌కి సంబంధం లేదని పేర్కొంది. ఇది ప్రైవేట్ వ్యవహారమని, అసోసియేషన్ గుర్తించలేదని తెలిపింది.

## 11మంది తమిళనాడు మత్స్యకారుల అరెస్ట్

**కొలంబో జనవరి 02 అక్షర వేదం**
తమిళనాడుకి చెందిన 11మంది మత్స్యకారులను అరెస్ట్ చేసినట్లు శ్రీలంక నేవీ శుక్రవారం పేర్కొంది. వారి బోటును కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. ఉత్తర ప్రావిన్స్‌లో కంకేసంతురైకి ఉత్తరాన గురువారం అర్ధరాత్రి మత్స్యకారులను అరెస్ట్ చేసినట్లు శ్రీలంక నేవీ అధికార ప్రతినిధి కమాండర్ బుద్ధిక సంపత్ తెలిపారు. వారు తమ జలాల్లో అక్రమంగా వేటాడుతున్నారని, హెచ్చరించినా వెనక్కి వెళ్లలేదని అన్నారు.



## ఈవీఎంల పనితీరుపై కర్నాటకలో సర్వే..

### రిపోర్టును తిరస్కరించిన రాష్ట్ర మంత్రి



**బెంగుళూరు జనవరి 02 అక్షర వేదం**
ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల పై ఓటర్లలో విశ్వాసం అన్న అంశంపై కర్నాటకలో ఇటీవల సర్వే నిర్వహించారు. ప్లానింగ్ అండ్ స్టాటిస్‌టిక్స్ శాఖ ఆధ్వర్యంలో నడిచే కర్నాటక మానిటరింగ్ అండ్ ఎవాల్యువేషన్ అథారిటీ ఆ సర్వే చేపట్టింది. సుమారు 5100 మంది ఓటర్ల నుంచి అభిప్రాయాలను సేకరించారు. అయితే 85 శాతం మంది ఓటర్లు ఈవీఎంలపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించినట్లు తెలిపారు. ఆ సర్వే రిపోర్టు ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ మధ్య ఘర్షణకు దారి తీసింది.ప్లానింగ్ అండ్ స్టాటిస్‌టిక్స్ శాఖ నిర్వహించిన సర్వేతో తమకు సంబంధం లేదని కర్నాటక ప్రభుత్వం చెబుతోంది. కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నట్లు బీజేపీ ఆరోపించింది. ఓటు చోరీ జరుగుతున్నట్లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలు నిజం కాదు అని బీజేపీ నేత బీవై విజయేంద్ర తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. సర్వే నివేదిక ద్వారా ఆ విషయం స్పష్టం అవుతోందన్నారు. కానీ ఆ సర్వేకు అనుమతి ఇవ్వలేదని కర్నాటక ఐటీశాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే అన్నారు. పీఎంవో ఆఫీసుతో లింకున్న ఓ వ్యక్తికి చెందిన ఎన్జీవో సంస్థ ఆ సర్వే చేపట్టినట్లు ఖర్గే తెలిపారు.


## పెండ్లికి ముందే సెక్స్ చేస్తే జైలుకే

### సహజీవనం చేసినా శిక్ష ఇండోనేషియాలో అమలు



**న్యూఢిల్లీ జనవరి 02 అక్షర వేదం**
పెండ్లికి ముందే సెక్స్ చేయడం లేదా సహజీవనం చేయడం శిక్షించదగిన నేరంగా పేర్కొంటున్న చట్టం ఇండోనేషియాలో అమల్లోకి వచ్చింది. దీనికి సంబంధించిన బిల్లును 2022 డిసెంబర్‌లో పార్లమెంటు ఆమోదించింది. మూడేండ్ల తర్వాత శుక్రవారం నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చింది.ఈ మూడేండ్లలో ఈ చట్టం గురించి ప్రజలకు, పోలీసులకు శిక్షణ ఇచ్చారు. వివాహేతర సంబంధాలు పెట్టుకుని, సెక్స్ చేస్తే, దోషులకు ఒక ఏడాది జైలు శిక్ష విధించవచ్చునని ఈ చట్టం చెప్తున్నది. పెండ్లి కాకుండానే సహజీవనం లేదా కలిసి జీవించడం చేస్తే ఆరు నెలల జైలు శిక్ష విధించవచ్చునని పేర్కొన్నది.

## యెమెన్‌పై సౌదీ దాడులు.. ఏడుగురు మృతి



**రియాద్: జనవరి 02 అక్షర వేదం**
యెమెన్ సంక్షోభం రోజురోజుకూ ముదురుతున్నది. యూఏఈ మద్దతున్న వేర్పాటువాదుల శిబిరాలను లక్ష్యంగా చేసుకుని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు శుక్రవారం జరిపిన వైమానిక దాడుల్లో ఏడుగురు మరణించగా, 20 మందికి పైగా గాయపడ్డారు.హద్రమౌత్ ప్రావిన్స్‌లోని అల్-ఖసా ప్రాంతంలోని మిలిటరీ శిబిరం లక్ష్యంగా కూడా ఈ దాడులు జరిగినట్టు హద్రమౌత్‌లోని సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ హెడ్ అబ్దుల్ మాలిక్ పేర్కొన్నట్టు ఏఎఫ్‌పీ వార్తా సంస్థ తెలిపింది. సౌదీతో సరిహద్దును పంచుకుంటున్న హద్రమౌత్‌లోని వేర్పాటు వాదుల శిబిరాలను, ఆ ప్రాంతాన్ని నియంత్రణలోకి తెచ్చుకునేందుకు సౌదీ అరేబియా ప్రయత్నిస్తున్నది.




# ఆకట్టుకుంటున్న 'లెగసీ' టీజర్!

## వారసత్వ యుద్ధానికి సిద్ధమైన 'విశ్వక్ సేన్'..

టాలీవుడ్ యంగ్ అండ్ డైనమిక్ హీరో, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరో విలక్షణమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'లెగసీ'. ప్యూర్ పొలిటికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. "పాలిటిక్స్ ఈజ్ పర్సనల్" అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. టీజర్ ప్రారంభం నుండి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ముఖ్యంగా విశ్వక్ సేన్ చెప్పిన డైలాగులు పొలిటికల్ హీట్‌ను పెంచుతున్నాయి:"రాజకీయమంటే పులిమీద సవారీ లాంటిదంటారు.. ఆ పులి మీద నాయకుడు ఒక్కడే కూర్చోవాలా? ఆ కుటుంబం మొత్తం కూర్చోవాలా?" "దిస్ ఈజ్ యాన్ ఇంటర్నల్ వార్ ఫర్ రియల్ లెగసీ" ఈ డైలాగ్స్ చూస్తుంటే, అధికారం కోసం ఒకే కుటుంబంలో జరిగే అంతర్గత పోరు, వారసత్వ రాజకీయాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని స్పష్టమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా విశ్వక్ సేన్ ఈ సినిమాలో ఒక సీరియస్ పొలిటీషియన్ పాత్రలో కనిపిస్తుండటం విశేషం. ఈ చిత్రానికి సాయికిరణ్ రెడ్డి దైడా దర్శకత్వం వహిస్తున్నారు. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ సినిమాలో ఏక్తా రాథోడ్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రావు రమేశ్, సచిన్ ఖేడ్కర్, మురళీ మోహన్, కేకే మేనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కలాహి మీడియా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమటి, సాయికిరణ్ రెడ్డి దైడా నిర్మిస్తున్నారు.



# సింగిల్ బ్యూటీ సైలెంట్ అయ్యిందే..

## ఆఫర్స్ కోసం ఎదురుచూస్తున్న కేతిక శర్మ

హాట్ బ్యూటీ కేతిక శర్మ.. చేసింది తక్కువ సినిమాలే అయిన విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది ఈ అందాల భామ. కేతిక శర్మ 2021లో విడుదలైన రొమాంటిక్ సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది.ఆకాష్ పూరి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ఆతర్వాత లక్ష్య అనే సినిమా చేసింది కానీ ఈ సినిమా ఫ్లాప్ అయ్యింది. వైష్ణవ్ తేజ్ తో రంగ రంగ వైభవంగా, అలాగే పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ హీరోగా నటించిన బ్రో సినిమాలో చేసింది. కానీ ఆ సినిమా కూడా అంతగా ఆకట్టుకోలేకపోయింది.ఆతర్వాత శ్రీ విష్ణు హీరోగా నటించిన సింగిల్ అనే సినిమాలో మెప్పించింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా కేతిక తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది. ఈ సినిమా హిట్ అయినా కూడా ఈ చిన్నదానికి అనుకుంతా ఆఫర్స్ రావడం లేదు.మొన్నామధ్య సో స్పెషల్ సాంగ్ కూడా చేసింది. ఇక ఇప్పుడు ఈ అమ్మడు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటుంది. ప్రస్తుతం కేతిక చేతిలో సినిమాలు ఏవి లేవు. కానీ సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మ ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది.రెగ్యులర్ గా క్రేజీ ఫోటోలు, హాట్ హాట్ పిక్స్ షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఇక తన అందాలతో కుర్రాళ్లకు మత్తెక్కిస్తోంది ఈ ముద్దుగుమ్మ. కేతిక క్రేజీ ఫోటోల పై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

# బ్లాక్ డ్రెస్‌లో అందాల హొయలు..


## శ్రీముఖి బ్యూటిఫుల్ ఫొటోస్!

అందాల ముద్దుగుమ్మ శ్రీ ముఖి గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ అమ్మడు సొంతం. తన వాక్ చాతుర్యం, గ్లామర్‌తో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకొని బుల్లితెరపై తన హవా కొనసాగిస్తుంది ఈ అందాల తార.పటాస్ కామెడీ షోతో తెలుగు అభిమానులకు పరిచయం అయ్యింది ఈ బ్యూటీ. ఈ షోలో తన యాంకరింగ్‌తో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. అదుర్స్, పటాస్ కామెడీ షోలతో కెరీర్ స్టార్ట్ చేసి, ఇప్పుడు స్టార్ యాంకర్లలో ఒకరిగా కొనసాగుతుంది.అవార్డు ఫంక్షన్స్, మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్స్, అన్నింటిలో హోస్ట్‌గా వ్యవహరిస్తూ, మంచి పాపులారిటీ సంపాదించుకుంటుంది. ముఖ్యంగా ఈ బ్యూటీ బిగ్ బాస్‌కు వెళ్లి వచ్చిన తర్వాత మరింత పాపులారిటీ సంపాదించుకుంది.బిగ్ బాస్ తర్వాత ఈ బ్యూటీని అవకాశాలు ఎక్కువగా వరించాయి. దీంతో బుల్లితెరపైనే కాకుండా సిల్వర్ స్క్రీన్ పై కూడా సందడి చేసింది ఈ చిన్నది. స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రల్లో నటించి, తన నటనతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది.ఇక ప్రస్తుతం వరసగా షోలు, ఈవెంటన్స్‌తో ఫుల్ బిజీగా గడిపేస్తున్న ఈ ముద్దుగుమ్మ ఏ కాస్త సమయం దొరికినా సరే సోషల్ మీడియాలో హంగామా చేస్తుంటుంది. తాజాగా ఈ చిన్నది బ్లాక్ కలర్ డ్రెస్‌లో తన అందాలతో అందరినీ ఆకట్టుకుంది.



# పొలిటికల్ ఎంటర్‌టైనర్ 'ధర్మస్థల నియోజకవర్గం' ఫస్ట్ లుక్ విడుదల!

మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మేరుం భాస్కర్ నిర్మాతగా, జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో రూపొందుతున్న పొలిటికల్ ఎంటర్టైనర్ 'ధర్మస్థల నియోజకవర్గం' చిత్ర విశేషాలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. నూతన సంవత్సర కానుకగా చిత్ర యూనిట్ ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా విడుదల చేసింది.సీనియర్ నటులు సాయికుమార్, సుమన్ లతో పాటు వరుణ్ సందేశ్, వితికా షేరు, నటరాజ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో వేగంగా దూసుకుపోతోంది. ఈ సందర్భంగా దర్శకుడు జై జ్ఞాన ప్రభ తోట మాట్లాడుతూ, ఇదొక విభిన్నమైన పొలిటికల్ ఎమోషనల్ డ్రామా అని, చంద్రబోస్ సాహిత్యం మరియు సునీత గానం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ చిత్రానికి వెంకట హనుమ సినిమాటోగ్రఫీ అందించగా, సాయిబాబు తలారి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. బి. వీరబాబు పి.ఆర్.ఓగా వ్యవహరిస్తున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ విడుదల చేసిన ఈ ఫస్ట్ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇక రాజకీయ నేపథ్యంలో సాగే ఈ ఎమోషనల్ డ్రామా ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి.




# కొత్త సంవత్సరంలో కొత్త కొత్తగా..

## అనుపమ బ్యూటిఫుల్ ఫొటోస్!

బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ ముద్దుగుమ్మ అ, ఆ సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి, మొదటి సినిమతోనే అందరి మనసు దోచేసుకుంది. ఈ మూవీలో ఈ అమ్మడు సెకండ్ హీరోయిన్‌గా, నాగవల్లి పాత్రలో తన అద్భుతమై నటనతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. దీంతో ఈ సినిమా తర్వాత ఈ చిన్నదానికి తెలుగులో అవకాశాలు క్యూకట్టాయి.ఈ మూవీ తర్వాత శర్వానంద్ శతమానం భవతి సినిమాలో హీరోయిన్‌గా నటించి మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఇక ఈ మూవీ తర్వాత ఉన్నది ఒక్కటే జిందగీ, కృష్ణున యుద్ధం, హలో గురు ప్రేమ కోసమే,రాక్షసుడు, 18 పేజీస్, సీతాకోక చిలుక, ఈగల్, టిల్లు స్క్వేర్ , కిష్కంద పురి, పరదా వంటి సినిమాల్లో నటించింది.ముఖ్యంగా ఈ బ్యూటీ టిల్లు స్క్వేర్ మూవీలో తన గ్లామర్‌తో ప్రతి ఒక్కరి మనసు దోచేసింది. దీని తర్వాత అనుపమ చాలా సినిమాల్లో నటించి, బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంది. వరసగా సినిమాలు చేస్తూ ఫల్ బిజీ బిజీగా గడిపేస్తుంది అయితే ఈ అమ్మడు వరసగా సినిమాలు చేస్తూ, బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంటూ దూసుకెళ్తున్నప్పటికీ, ఈ బ్యూటీ మాత్రం స్టార్ హీరోయిన్‌గా తన సత్తా చాటలేకపోయింది.ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటే ఈ బ్యూటీ తాజాగా కొత్త సంవత్సరం సందర్భంగా కలర్ ఫుల్ డ్రెస్‌లో కనిపించి, తన అభిమానులకు అందాల విందునిచ్చింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

